క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



కృష్ణ మాస్టారు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ ఇటీవల దారుణ హత్యకు గురయ్యారు. ఈ మేరకు ఆయన కుటుంబాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ సోమవారం కలిసి పరామర్శించారు. కృష్ణ మాస్టారు లేనిలోటు తీర్చలేనిదని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను కోరారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బేబి నాయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఊరేగించేందుకు చౌడేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు

రాజాం: మల్లిఖార్జున కాలనీలో ఉన్న కల్యాణిగౌరి మల్లిఖార్జునస్వామి ఆలయ ఆవరణలో ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయ 28వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఉత్సవ విగ్రహాల తిరువీధి చేపట్టారు. ఈ క్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ మొక్కులు చెల్లించుకున్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు




చౌడేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామంలో దేవాంగుల కులదైవమైన చౌడేశ్వరిదేవికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శంకర్ గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి భక్తులు విశేష పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి

వంగర: గ్రామాల్లోని ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన నిర్మాణ దశలోని సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల స్థితిగతులపై ఆరాతీశారు. నిర్మాణాలకు సకాలంలో బిల్లులు చెల్లించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఆడిట్‌పై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: మండలంలోని దోసరి గ్రామ సచివాలయం వద్ద గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు ఇంటర్నల్ ఆడిట్‌పై సోమవారం అవగాహన కల్పించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ ఎ.చిరంజీవి మాట్లాడుతూ ఈ ఆడిట్ ద్వారా స్వయంశక్తి సంఘాలకు సంబంధించి, అక్రమాలు బయటకు రావడమే కాకుండా నిధుల వినియోగం, రుణాల చెల్లింపు వంటి అంశాలు క్షుణ్ణంగా తెలుస్తాయని, తద్వారా సంఘాల పురోగతికి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం టి. దధికుమార్, సీసీలు, సీఎఫ్‌లు, వీఓలు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపై వదిలేస్తే జరిమానా

బొబ్బిలి: పశువులను అనవసరంగా రోడ్లపై వదిలేస్తే సంబంధిత పశు యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన పట్టణంలో ఎక్కడపడితే అక్కడే విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులు, గేదెలు, ఎద్దులు పాదచారులపై ఒక్కోసారి దాడులకు ఎగబడుతున్నాయని, పశు యజమానులు వాటిని నిర్లక్ష్యం చేయడం వల్లే ఇలా జరుగుతోందన్నారు. ఇదిలా ఉండగా సోమవారం పలుచోట్ల సంచరిస్తున్న నాలుగు పశువులను మున్సిపల్ సిబ్బంది అదుపులోకి తీసుకుని, బంధించారు. ఇకపై ఎవరైనా ఇలా రోడ్లపైకి పశువులను వదిలేస్తే జరిమానా విధిస్తామన్నారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఓ పెద్దమోసకారి అని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను తన మాయమాటలతో మరోసారి మోసగించేందుకు సిద్ధమవుతున్నారని ఆయనను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని వస్త్రపురి కాలనీలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించగా, జై జగనన్న.. జై జోగులన్న నినాదాలతో జనం ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు అందిస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. గతంలో టీడీపీ 600 హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఆరు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. అందుకే ఆయనను ప్రజలు పక్కనబెట్టారన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్నందున ఉచిత పథకాలు వద్దన్న ఆయనే మళ్లీ ఉచిత పథకాలు ఇస్తాననడం వెనక ఎలాగైనా అధికారం చేజిక్కుంచుకోవాలన్న స్వార్థపూరితమైన ఆకాంక్ష కనబడుతోందన్నారు. ప్రజలు దీనిని గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే అధికారంలోకి తీసుకువచ్చి, సంక్షేమ పాలనను కొనసాగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, యూత్ కన్వీనర్ వి.విజయ్‌కుమార్, నేతలు వి.గణపతి, ఎస్.పెంటయ్య, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు

రాజాం: ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. మండలంలోని కంచరాం-1 గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు, పంచాయతీ సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు చేతులమీదుగా పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు అందించడం జరుగుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వక్తలు కోరారు.



రేగిడి: కోడిశలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ

రేగిడి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోడిశ, ఉనుకూరు గ్రామాల్లో పలువురికి ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి చేతుల మీదుగా పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కొండకు అభిషేకం



కొండపై బెల్లం పాయసంను వరదగా పారిస్తూ అభిషేకం చేస్తున్న సిరిపురం గ్రామస్తులు

రాజాం/సంతకవిటి: వర్షాలు కురవాలని కోరుతూ సంతకవిటి మండలంలోని సిరిపురం గ్రామ ప్రజలు గ్రామ సమీపంలోని కొండకామేశ్వర కొండకు వరద పాయసంతో సోమవారం అభిషేకం నిర్వహించారు. కొండపైనే మట్టికుండలో బెల్లంపాయసం తయారు చేసి, దానిని కొండపై నుంచి వరదగా పారించి, అభిషేకించారు. అంతకుముందు కొండపై ఉన్న కొండకామేశ్వర ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని దైవాన్ని వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నామని, దీంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుస్తకాలు, పెన్నుల అందజేత

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఉషారాణి సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు, అట్టలు, పలకలను ఎంఈఓ వై.దుర్గారావు చేతులమీదుగా సోమవారం అందజేశారు. దాదాపు 50 మంది విద్యార్థులకు వీటిని ఉచితంగా అందజేసిన సదరు టీచర్‌ను ఎంఈఓ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రమాణాల మెరుగుకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేలసారవంతం

రేగిడి: పచ్చిరొట్ట ఎరువు ద్వారా నేలసారవంతమవుతుందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పీఎండీఎస్ క్రాప్ కటింగ్‌పై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కిలో పచ్చిరొట్ట ఎరువు 100 కిలోల పశువుల ఎరువుతో సమానమన్నారు. అందరూ పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని, మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత వాటిని నేలలో కలియదున్నాలన్నారు. దీంతో నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకే సామాజిక తనిఖీలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో నివేదికల వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీలు

- ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎల్.లక్ష్మణరావు, విజిలెన్స్ అధికారి రవీంద్ర

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి జరగకుండా ఉండేదుకే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామని ఉపాధి హామీ ఏపీడీ ఎల్.లక్ష్మణరావు, ఉపాధి హామీ విజిలెన్స్ అధికారి రవీంద్ర అన్నారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.14,63,13,558 ఉపాధి హామీ నిధులతో చేపట్టిన చెరువులు, రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు తదితర పనులకు సంబంధించి, ఎస్ఆర్‌పీలు ఎస్.అచ్యుతరావు, మాధవరావుల ఆధ్వర్యంలో డీఆర్‌పీలు 10 రోజుల పాటు సామాజిక తనిఖీలు నిర్వహించారన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ రమామణి ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఏపీడీ, డీవీఓలు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి, ఒక్కో పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి, సామాజిక తనిఖీ నివేదికలను ఆయా డీఆర్‌పీలు చదివి వినిపించారు. చాలా గ్రామాల్లో డిమాండ్ రసీదులు, వేతనాల చెల్లింపుల రసీదులు వేతనదారులకు ఇవ్వలేదని, పనులు నిర్వహణ ప్రాంతాల్లో నేమ్ బోర్డులు, సమాచార బోర్డుల ఏర్పాటు చేయలేదని ఆడిట్ బృందం గుర్తించింది. రొంపల్లిలో పాఠశాల ప్రహరీ నిర్మాణంలో భాగంగా గతంలో నిర్మించిన పునాది బిల్లు చెల్లింపు జరిగినా పాత పునాది మీదనే కొత్తగా ప్రహరీ నిర్మాణం జరుపుతున్నారని, ఆ నిర్మాణానికి సంబంధించి చెల్లింపులు జరిగాయని గుర్తించారు. బూసాయవలసలో 95 శాతం మంది వేతనదారుల జాబ్‌కార్డులు అప్‌డేషన్‌తో పాటు 7 రకాల రికార్డులకు సంబంధించిన వివరాలు కూడా క్షేత్ర సహాయకుడు అప్‌డేషన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలింది. దాదాపు అన్ని పంచాయతీల్లో మస్టర్లలో సంతకాలు లేకుండా లబ్ధిదారులు వచ్చినట్లు చూపి, వారి ఖాతాల్లో వేతన డబ్బులు జమ చేసినట్లు గుర్తించి, నివేదిక చదివి, వినిపించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మన్ అధికారిణి ఎస్.అన్నపూర్ణ, క్లస్టర్ ఏపీడీ జనార్దనరావు, ఏపీఓలు హరనాథ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.272

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పనులు చేస్తే రోజుకు రూ.272 వేతనం లభిస్తుందని ఏపీఓ ఎస్.హరనాథ్ తెలిపారు. మండలంలోని లచ్చారాయపురం గ్రామంలో ఉన్న గిరిజాలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనికి వచ్చిన వారికే మాత్రమే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు

బొబ్బిలి: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విరివిగా పారిశుద్ధ్య పనులు చేపట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ పోతుల రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక పట్టణంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన ప్రతీ గ్రామంలో జనం జ్వరాల బారినపడకుండా చూడాలన్నారు. అలాగే సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా ఆర్‌బీకేల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చల్ల లక్ష్మణరావు, సీడీపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు అని, ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెర్లాం ప్రాంతానికి చెందిన సుంకరపల్లి శ్రీనివాసరావు తన 10 సెంట్ల భూమిని బొండపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని, ఆ భూమిలో గ్రావెల్ వేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంటనే రెవెన్యూ అధికారులు ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం పక్కాగా నిర్వహించి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించి, పలు ప్రజాసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించి, పరిశీలించారు. భూముల రీసర్వే ప్రకారం హద్దురాళ్ల ఏర్పాటు జరగలేదని గజరాయునివలసకు చెందిన ఇద్దరు రైతులు ఫిర్యాదు చేయగా, బొత్సవానివలసకు చెందిన అలజంగి దేవయ్య ఆన్‌లైన్‌లో తన పేరిట భూ వివరాలు చూపించకపోవడంపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.రఫీజాన్, ఎంపీడీఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో విద్యుత్, పెన్షన్, భూ సమస్యల పరిష్కారంపై ప్రజల నుంచి వినతిపత్రాలు వచ్చాయి. వాటిని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావులు పరిశీలించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



వంగర: భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న తలగాం గ్రామ రైతులు

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్, మండల స్థాయి అధికారులు పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించి, పరిశీలించారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, పరిష్కారం కాని సమస్యను ఎందుకు ఆ సమస్య పరిష్కారం కాలేదోనన్న విషయం కూడా అర్జీదారుకి తెలియజేయాలని ఎంపీడీఓ తెలిపారు.

గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి కావాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: గడువులోగా జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు పూర్తి కావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చేపట్టిన జగనన్న కాలనీ గృహ నిర్మాణాల సమీక్షలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు మొత్తం 10,930 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 5,964 ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు పేర్కొన్నారు.

శ్లాబ్ దశలో 228, రూఫ్ లెవల్‌లో 680, పునాది దశలో 2,717 ఇళ్లు ఉన్నాయన్నారు. ఇవేకాకుండా బిలో బేస్‌మెంట్ లెవల్‌లో మరో 1500 ఇళ్లు ఉన్నాయని, వీటిని ఈ నెలాఖరులోగా పునాది స్థాయికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, అవసరమైన వారికి నిర్మాణ సామగ్రి కూడా సరఫరా చేయాలని తెలిపారు. నిర్మాణాలు చేపట్టని, నిర్మాణాల్లో జాప్యం చేస్తున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి, నిర్మాణాలు చేయడంలో ఆలస్యంపై ఆరాతీసి, వారికి ఏమైనా సమస్యలు ఉంటే అవితీరేలా సలహాలు, సూచనలు చేయాలన్నారు. సమావేశంలో డీఈఈ పి.అప్పయ్య, ఏఈ ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష సర్వే



ఎంపీడీఓతో చర్చిస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: జగనన్న సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణితో సమావేశమైన ఆయన జగనన్న సురక్ష కార్యక్రమ సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వివాదాలకు తావులేకుండా సర్వే జరిగేలా చూడాలని, కావాల్సిన వారికి తప్పనిసరిగా 11 రకాల సిటిజన్ సర్వీసులను అందించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పనులకు వెళ్లే సమయంలో ఇళ్లకు వెళ్లకుండా వారు ఉండే సమయంలో మాత్రమే వలంటీర్లు వెళ్లి సర్వే చేసేలా చూడాలన్నారు. అర్హులందిరకీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సిటిజన్ సర్వీసులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరంగా 'జగనన్న గోరుముద్ద'



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం రుచికరంగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును ఆయన పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని, తప్పకుండా మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు వండిపెట్టాలని తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు ఈ భోజనం చేసి, భోజనం బాగుందా లేదా అని వారి అభిప్రాయం తీసుకోవాలని ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళకు ప్రభుత్వ పథకాలు వివరించి, సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిరిడి గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలుచేసిన పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఓవైపు పోర్టులు, విమానాశ్రయాలు, పరిశ్రమల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూనే మరోవైపు అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందని, అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. అన్ని రంగాల్లో మన రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. ఇప్పటికే సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల దృష్ట్యా ప్రపంచ దృష్టిని ఆకర్షించారన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు, సచివాలయ వ్యవస్థను కొన్ని రాష్ట్రాలు అమలు చేసేందుకు వారి రాష్ట్రాల్లో సాధ్యాసాధ్యాలపై చర్చిస్తున్నాయన్నారు. ఇదే ఆదర్శవంతమైన పాలనకు ఉదాహరణన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించి, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్స కాశినాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, ఎంపీడీఓ పోతుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చితేనే రహదారి నిర్మాణం



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మెంటాడ: మండల కేంద్రం మీదుగా జరుగుతున్న హరిత రహదారి నిర్మాణానికి భూములిచ్చిన రైతులు సోమవారం నిరసనకు దిగారు. రహదారి అవతలి వైపు ఉన్న తమ భూములకు వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రహదారికి భూమలు ఇచ్చేటప్పుడు అదనంగా 30 శాతం పరిహారం చెల్లిస్తామని చెప్పారని, అయినా ఇంతవరకు చెల్లించలేదన్నారు. తమ ఈ రెండు డిమాండ్లు నెరవేర్చకపోతే రహదారి నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు అరసాడ అప్పారావు, నడుపూరు సత్యనారాయణ, రేగిడి రాంబాబు, కునుకు అచ్చుతరావు, గేదెల సత్యం, పాండ్రంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెంటాడ: మండలంలోని కె.ఎల్.వలస పంచాయతీ పరధిలోని బాసలపాడు గ్రామానికి చెందిన మినీ అంగన్‌వాడీ పోస్టు భర్తీకి సంబంధించి, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో ఐసీడీఎస్ పీఓ నాగమణి వెల్లడించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఆ పోస్టు ఓసీ వీహెచ్ కేటగిరీకి కేటాయించడం జరిగిందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.